కొత్తతరం పాత్రికేయం పిలుస్తోంది!

సమాచార స్రవంతిలో.. వార్తాపత్రికలే కాకుండా టెలివిజన్ ఛానెళ్లు, వెబ్‌సైట్లు, యాప్‌లు, వెబ్ టీవీలూ భాగమయ్యాయి. విస్తరిస్తున్న వేదికలన్నీ ఆదరణ పొందుతున్నాయి. భిన్న తరాల నేపథ్యం ఉన్న పాఠకులే ఇందుకు కారణం. అభిరుచికి తగ్గట్టుగా కావాల్సిన సమాచారాన్ని కోరుకున్న మాధ్యమాల్లో వీరంతా పొందుతున్నారు. వేదికలు పెరగడంతో ఉపాధి అవకాశాలూ విస్తరించాయి. దీంతో సమర్థ జర్నలిస్టులు, కంటెంట్ ప్రొవైడర్లు, కాపీ రైటర్ల కోసం సంస్థలు ఎదురుచూస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పలు విద్యా సంస్థలు జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, మల్టీ మీడియా కోర్సులు అందిస్తున్నాయి. తెలుగు మీడియా సంస్థలు ఉచితంగా విద్యనందిస్తూ.. స్టైపెండ్ చెల్లించి, ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. మీడియా సంస్థల్లో చేరాలనే ఆసక్తి ఉన్నవారికి ఆహ్వానం పలుకుతున్నాయి.

- వేదికలు విస్తృతం.. అవకాశాలు అద్భుతం
- జర్నలిజం/ మీడియా కోర్సులు

ప్రతి ఒక్కరికీ అవసరమైన సమాచారాన్ని అందిస్తూ.. చైతన్యవంతం చేయడంలో నేటి జర్నలిస్టులు ముఖ్య పాత్ర వహిస్తున్నారు. వార్తలు సేకరించి రాయడానికి మాత్రమే జర్నలిజం పరిమితం కాలేదు. వివిధ అంశాలపై ప్రజల ఆలోచనలను విస్తరించడం, స్పష్టతను పెంపొందించడం, మంచి మార్పు దిశగా అడుగులు పడేలా స్ఫూర్తిదాయక కథనాలు అందించడం జర్నలిస్టుల కర్తవ్యం. మేటి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, విస్తృత పరిజ్ఞానం సొంతం చేసుకుని, తేలిక పదాలతో సరళంగా రాయగలిగే నైపుణ్యం ఉన్నవాళ్లు తక్కువ వ్యవధిలోనే మెరుగైన స్థాయిని అందుకోవచ్చు. ఏ వేదికను ఎంచుకున్నప్పటికీ భాషపై పట్టు, సామాజిక స్పృహ, తెలుసుకోవాలనే ఆసక్తి, సునిశిత పరిశీలన, తార్కికంగా ఆలోచించడం, పుస్తకాల అధ్యయనం, తప్పులు లేకుండా రాయడం.. తప్పనిసరి.

నేపథ్యం ఏదైనా...

జర్నలిజం, మీడియా కోర్సుల్లో చేరడానికి విద్యా నేపథ్యంతో సంబంధం లేదు. ఒకప్పుడు ఎక్కువగా బీఏ, ఎంఏ, భాషా శాస్త్రాలు చదివినవారే మీడియాలో ఎక్కువమంది ఉండేవారు. ప్రస్తుతం బీటెక్, బీఎస్సీ నేపథ్యంతో ఈ రంగంలో ప్రవేశిస్తోన్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ కోర్సులు అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనే చదువుకోవచ్చు. అయితే అన్ని చోట్లా ఇవి అందుబాటులో లేవు. పీజీ స్థాయిలో మాత్రం దాదాపు విశ్వవిద్యాలయాలన్నీ మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (ఎంసీజే), జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్... తదితర పేర్లతో కోర్సులు అందిస్తున్నాయి. యూజీలో చదువుకున్న సబ్జెక్టులు/ గ్రూపులతో సంబంధం లేకుండా వీటిలో ఎవరైనా చేరవచ్చు. కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ సంస్థలూ యూజీ, పీజీ కోర్సులు అందిస్తున్నాయి.

స్పెషలైజేషన్లు

ప్రతి విషయం/రంగం గురించి ఎంతో కొంత తెలుసుకుంటూ, ఏదైనా ఒక విభాగంలో ప్రత్యేకమైన నైపుణ్యం పొందినవారికి గుర్తింపు, ప్రోత్సాహం దక్కుతుంది. ఇలాంటి వారు పత్రికలు, టీవీలు, వెబ్‌సైట్‌ల తోపాటు మరెన్నో వేదికల్లో సేవలు అందించవచ్చు. ఎడ్యుకేషన్, హెల్త్, స్పోర్ట్స్, బిజినెస్, ఫీచర్స్, యూత్, లీగల్, క్రైమ్, పొలిటికల్... ఇలా ఎన్నో విభాగాలు మీడియా సంస్థల్లో ఉన్నాయి. ఎందులోనైనా గట్టిపట్టున్నవారు స్పెషలిస్ట్ సేవలు అందించవచ్చు.

ప్రాంతీయ భాష పత్రికల్లో రాణించడానికి ఆంగ్ల అనువాద నైపుణ్యం ఉపయోగపడుతుంది.

కోర్సుల్లో...

పీజీ స్థాయిలో..జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ ఇంట్రడక్షన్, ఎడిటింగ్ టెక్నిక్స్, మీడియా లాస్, భారత రాజ్యాంగం, రిపోర్టింగ్ మెథడ్స్, మీడియా మేనేజ్‌మెంట్, అడ్వర్టైజింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ వీటిపై అవగాహన కల్పిస్తారు. యూజీ కోర్సుల్లో.. రైటింగ్ ఫర్ మీడియా, కమ్యూనికేషన్ ఇంట్రడక్షన్, మీడియా లాస్ అండ్ ఎథిక్స్, ప్రింట్ జర్నలిజం, న్యూమీడియా, టెలివిజన్ జర్నలిజం అండ్ ప్రొడక్షన్, పబ్లిక్ రిలేషన్స్ అడ్వర్టైజింగ్ ప్రాక్టీసెస్, గ్లోబల్ మీడియా... తదితర అంశాల్లో శిక్షణ అందిస్తారు. యూజీ కోర్సుల వ్యవధి మూడేళ్లు. మొత్తం ఆరు సెమిస్టర్లు. పీజీ రెండేళ్ల వ్యవధి. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీజీ తర్వాత ఆసక్తి ఉంటే పీహెచ్‌డీలో చేరవచ్చు. డాక్టరేట్ డిగ్రీ ఉన్నవారు బోధన రంగంలో రాణించగలరు.

పేరున్న విద్యాసంస్థలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా, బెనారస్ హిందూ యూనివర్సిటీ, పుణే యూనివర్సిటీ, సింబయాసిస్, సెయింట్ జేవియర్, క్రైస్ట్, మణిపాల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం అండ్ న్యూ మీడియా, ఇగ్నో తదితర సంస్థలెన్నో యూజీ, పీజీల్లో జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్ కోర్సులకు పేరొందాయి. వీటిలో ఎక్కువ సంస్థలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలే. సీయూసెట్‌లో చూపిన ప్రతిభతో కోర్సులోకి తీసుకుంటారు. ఏప్రిల్ 19లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్షల్లో.. జనరల్ ఇంగ్లిష్, రీడింగ్ కాంప్రహెన్షన్, లాజికల్ రీజనింగ్, కరెంట్ అఫైర్స్, మీడియా అండ్ కమ్యూనికేషన్... అంశాల్లో ప్రశ్నలు వస్తాయి.

ఉపాధి అవకాశాలు

సుశిక్షితులైనవారు మీడియా సంస్థల్లోనే కాకుండా.. ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల్లో పీఆర్వోలుగా, ప్రైవేటు సంస్థల్లో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగాల్లో మేనేజర్లుగా రాణించవచ్చు.

ప్రింట్ మీడియా సంస్థలు, వార్తా ఛానెళ్లు ప్రత్యేకంగా వెబ్‌సైట్లు, యాప్‌లను తీసుకొచ్చాయి. ఇవేకాకుండా పేరొందిన మీడియా సంస్థలెన్నో ప్రాంతీయ భాషల్లోనూ వెబ్‌సైట్లు నడుపుతున్నాయి. దీంతో స్థానిక భాషల్లో ప్రావీణ్యం, విషయ పరిజ్ఞానం ఉన్నవారికి అవకాశాలు పెరిగాయి. ఇప్పటికే బీబీసీ తెలుగు, టైమ్స్ ఆఫ్ ఇండియా సమయం, హిందూస్థాన్ టైమ్స్, ఏబీపీ, వే టూ న్యూస్... ఇలా పదుల సంఖ్యలో సంస్థలు తెలుగులో వార్తలు అందిస్తున్నాయి. సమర్థులకు పెద్ద మొత్తంలోనే వేతనాలూ దక్కుతున్నాయి. కంటెంట్ ప్రొవైడర్, కంటెంట్ రైటర్, కంటెంట్ డెవలపర్, కాపీ రైటర్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు తదితర హోదాలతో వీరికి అవకాశం కల్పిస్తున్నారు. భిన్న వేదికలపై (ప్రిజిటల్) సేవలందించగలిగే నైపుణ్యం ఉంటే తక్కువ వ్యవధిలోనే రాణించవచ్చు.

అంతర్జాలంలో వేల సంఖ్యలో వెబ్‌సైట్లు సమాచారం అందిస్తున్నాయి. వీటిలో వాస్తవికత, కచ్చితత్వానికి ప్రాధాన్యం ఇచ్చేవే ఆదరణ పొందుతున్నాయి. ఎక్కువమందికి చేరుకోవాలని మసాలా వార్తలు రాసి, తప్పుదోవ పట్టించేవి తక్కువ వ్యవధిలోనే మనుగడ కోల్పోతున్నాయి. అందువల్ల ఏదైనా సంస్థలో చేరేముందే వేతనం ఒక్కటే కాకుండా అన్ని కోణాల్లోనూ పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలి. కొంత అనుభవం, పేరుతో ఫ్రీలాన్స్ రైటర్‌గానూ రాణించవచ్చు లేదా సొంతంగా వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానెల్ నిర్వహించి ఆర్జించవచ్చు. అన్ని సంస్థలూ తమ ఉత్పత్తుల వివరాలను జనాల్లోకి తీసుకెళ్లడానికి కంటెంట్ రైటర్లని నియమించుకుంటున్నాయి. సాంకేతిక నేపథ్యం ఉన్నవారు టెక్నికల్ రైటర్లుగానూ సేవలందించవచ్చు. రాజకీయ పార్టీలు, నేతలు.. తమ ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రత్యేకంగా పీఆర్ నిపుణులను తీసుకుంటున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో..

ఉస్మానియా, ఆంధ్రా, ఆచార్య నాగార్జున, శ్రీవెంకటేశ్వర, కాకతీయ, పద్మావతి మహిళ.. ఇలా దాదాపు పాత, కొత్త విశ్వవిద్యాలయాలన్నీ ఎంఏ (జర్నలిజం)/ఎంసీజే కోర్సులు అందిస్తున్నాయి. రాష్ట్రాలవారీ నిర్వహించే పీజీసెట్‌లతో ప్రవేశం లభిస్తుంది.

మీడియా సంస్థల్లోనూ...

కొన్ని మీడియా సంస్థలు జర్నలిజం స్కూల్/ కాలేజీలను నెలకొల్పి, తమ అవసరాలకు అనుగుణంగా ఔత్సాహిక గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దుతున్నాయి. ఈనాడు, మరికొన్ని తెలుగు పత్రికలు ఈ సౌకర్యం కల్పిస్తున్నాయి. ఉచితంగా చదివించి, ప్రతి నెలా స్టైపెండ్ అందించి ప్రోత్సహిస్తున్నాయి. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారిని ట్రైనీలుగా తీసుకుంటున్నాయి. అనంతరం పనితీరును బట్టి శాశ్వత విధుల్లోకి మారుస్తున్నాయి.

ఆంగ్ల పత్రికలూ జర్నలిజం కాలేజీలు ఏర్పాటు చేశాయి. ఏషియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏసీజే), చెన్నై ద హిందూ ఆధ్వర్యంలో నడుస్తోంది. మేటి సంస్థగా గుర్తింపు పొందింది. ఇక్కడ ఏడాది వ్యవధితో అందిస్తోన్న పీజీ ప్రోగ్రాం ఇన్ ఇంటిగ్రేటెడ్ మల్టీ మీడియా జర్నలిజం కోర్సు చదవడానికి రూ.4.60 లక్షల ఫీజు చెల్లించాలి. కొంతమందికి స్కాలర్‌షిప్పు అందిస్తారు. ప్రాంగణ నియామకాల ద్వారా పలు జాతీయ మీడియా సంస్థలు వీరికి అవకాశం కల్పిస్తున్నాయి. ప్రకటన వెలువడింది. మేలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. టైమ్స్ స్కూల్ ఆఫ్ జర్నలిజం, మనోరమ జర్నలిజం కాలేజ్ కూడా ఇదే తరహాలో కోర్సులు అందిస్తున్నాయి.

ఈనాడు జర్నలిజం స్కూలు దరఖాస్తు గడువు నేడే

మల్టీ మీడియా, టెలివిజన్, మొబైల్ జర్నలిజం విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనాడు జర్నలిజం స్కూలు (ఈజేఎస్) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. రాతపరీక్ష, బృందచర్చ, మౌఖిక పరీక్షల్లో ప్రతిభ చూపినవారికి అవకాశం కల్పిస్తారు. ఏడాది కోర్సులో మొదటి ఆరు నెలలు రూ.14,000, తర్వాత ఆరు నెలలు రూ.15,000 అందిస్తారు. కోర్సు పూర్తిచేసినవారికి శిక్షణ సమయంలో రూ.18,000 చెల్లిస్తారు. ప్రొబేషన్‌లో 20,000 కన్ఫర్మేషన్‌లో రూ.22,000 అందుతాయి.

అర్హత: ఏదైనా డిగ్రీ. ప్రస్తుతం చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్న, రాసినవారూ అర్హులే. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 28 ఏళ్లకు మించరాదు.

ఎంపిక: ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పరీక్షలు, బృందచర్చ, ఇంటర్వ్యూ లతో.

రాత పరీక్షలో: జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రావీణ్యం తెలుసుకునేందుకు ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు అడుగుతారు. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువాదం, తాజా సంఘటనలపై వ్యాసం రాయాలి. తెలుగులో రాయగలనేర్పు, ఆంగ్లంపై అవగాహన, లోకజ్ఞానం, వర్తమాన అంశాలపై పట్టు ఉంటే పరీక్షలో రాణించగలరు. నమూనా ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే పరీక్షపై అవగాహన పొందవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు గడువు: ఏప్రిల్ 6
ప్రవేశ పరీక్ష తేదీ: ఏప్రిల్ 16 (అన్ని ఈనాడు ప్రచురణ కేంద్రాల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు).
దరఖాస్తు రుసుము: రూ.200.
వెబ్‌సైట్లు: https://www.eenadu.net/, https://pratibha.eenadu.net/

తాజా ఇంటర్వ్యూలు

హైదరాబాద్‌లో

ఫండ్‌రైజింగ్ అండ్ కమ్యూనికేషన్స్

సంస్థ: అభినవ్ సోషల్ ట్రస్ట్
స్టైపెండ్: నెలకు రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ, తెలుగు మాట్లాడటం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/bd2a42

రోబోటిక్స్ ఇంజినీరింగ్

సంస్థ: టెకొల్యూషన్
స్టైపెండ్: నెలకు రూ.20,000-30,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: రోబోటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్, రోబోటిక్స్ నైపుణ్యాలు
internshala.com/i/e3166c

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్

సంస్థ: క్యాపిటల్‌నో
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: బిజినెస్ ఎనాలిసిస్, బిజినెస్ రిసెర్చ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/2cb71a

కంటెంట్ రైటింగ్

సంస్థ: డిజిటల్ 1360
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: బ్లాగింగ్, కంటెంట్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/070f4a

ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: యాడ్‌వర్‌గో ఓవర్సీస్
స్టైపెండ్: నెలకు రూ.14,000-17,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: ఇంటర్నేషనల్ బిజినెస్ డెవలప్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/07d2ee

ఫొటోగ్రఫీ

సంస్థ: స్పాట్‌లెట్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 13
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/d247ee

కోఆపరేటివ్ బ్యాంకులో మేనేజర్‌లు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్(డీసీసీబీ) 6 మేనేజర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: 65 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో బీకాం. పీజీ (ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్), కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం. ఉమ్మడి విజయనగరం జిల్లా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
వయసు: 01.01.2023 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు, రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 15.04.2023.
రాత పరీక్ష తేదీ: మే/ జూన్ 2023.
వెబ్‌సైట్: www.dccbviziana-garam.com/careers/

నోటిఫికేషన్స్
ప్రభుత్వ ఉద్యోగాలు

నైవేలి లిగ్నైట్‌లో ఇండస్ట్రియల్ ట్రైనీలు

తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లా నైవేలిలోని ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఏడాది కాలానికి ఎన్ఎల్‌సీ ప్రాజెక్టులు/ కార్యాలయాల్లో 56 ఇండస్ట్రియల్ ట్రైనీల (ఫైనాన్స్) నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.
వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. **అర్హత:** ఇంటర్మీడియట్, సీఏ లేదా సీఎంఏ. **స్టైపెండ్:** నెలకు రూ.22,000. **ఎంపిక:** విద్యార్హత పరీక్ష మార్కుల ఆధారంగా.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 22-04-2023.
వెబ్‌సైట్: https://www.nlcindia.in/new_website/index.htm

ముంబయిలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీలు

ముంబయిలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) 325 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.
అర్హత: సంబంధిత ఇంజినీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ.
దరఖాస్తు రుసుము: రూ.500 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది).
వయసు: 28-04-2023 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.
ఎంపిక: గేట్ 2021/ 2022/ 2023 స్కోరు, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 11-04-2023.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28-04-2023.
వెబ్‌సైట్: https://npcilcareers.co.in/

వాక్-ఇన్స్

ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్‌లు

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ మూడేళ్ల కాలవ్యవధికి 20 సీనియర్ రెసిడెంట్/సీనియర్ డెమాన్‌స్ట్రేటర్ల నియామకానికి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
విభాగాలు: అనస్థీషియాలజీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, డెంటిస్ట్రీ, జనరల్ మెడిసిన్, న్యూరో సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఓ అండ్ జీ, ఆఫ్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, రేడియోథెరపీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ అంకాలజీ, ట్రామా అండ్ ఎమెర్జెన్సీ, యూరాలజీ.
అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్, డీఎన్‌బీ, ఎండీ, ఎండీఎస్, ఎంసీహెచ్ .
వయసు: 45 సంవత్సరాలు మించకూడదు.
దరఖాస్తు రుసుము: రూ.1,000 (ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు రూ.500).
వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీ: 14-04-2023.
వేదిక: అడ్మిన్ అండ్ లైబ్రరీ బిల్డింగ్, ఎయిమ్స్ మంగళగిరి, గుంటూరు జిల్లా.
వెబ్‌సైట్: https://www.aiimsmangalagiri.edu.in/

ప్రవేశాలు

ఏపీ ఆర్‌డీసీసెట్-2023

నాగార్జునసాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి డిగ్రీ (ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఏపీ ఆర్‌డీసీ సెట్-2023 నోటిఫికేషన్ విడుదలయింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
(గ్రూపు, సీట్లు: బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)- 40 సీట్లు; బీకాం- 40 సీట్లు; బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)- 36 సీట్లు; బీఎస్సీ(మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్)- 36 సీట్లు.
అర్హత: 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక ప్రమాణాలు: కామన్ ఎంట్రన్స్ టెస్ట్, రిజర్వేషన్ ఆధారంగా.
పరీక్ష ఫీజు: రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.04.2023
హాల్ టికెట్‌ల జారీ: 12.05.2023
ప్రవేశ పరీక్ష తేదీ : 20.05.2023
మెరిట్ జాబితా వెల్లడి: 08.06.2023
మొదటి దశ కౌన్సెలింగ్ తేదీ: 15.06.2023
రెండో దశ కౌన్సెలింగ్ తేదీ: 22.06.2023
మూడో దశ కౌన్సెలింగ్ తేదీ: 28.06.2023
వెబ్‌సైట్: https://aprs.apcfss.in/indexinter.jsp

సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో కొలువులు

కోల్ ఇండియా లిమిటెడ్‌కు అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్.. సుమారు ఆరున్నర దశాబ్దాలుగా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది. ఈ మినీరత్న సంస్థ తాజాగా ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అభ్యర్థులను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

మొత్తం 330 ఖాళీల్లో మైనింగ్ సర్దార్-77, ఎలక్ట్రీషియన్ (నాన్ ఎగ్జిక్యూటివ్) టెక్నీషియన్-126, డిప్యూటీ సర్వేయర్-20, అసిస్టెంట్ ఫోర్‌మేన్ (ఎలక్ట్రికల్)-107 పోస్టులు ఉన్నాయి.

1. మైనింగ్ సర్దార్ పోస్టుకు మెట్రిక్యులేషన్/ తత్సమాన పరీక్ష పాసవ్వాలి. మైనింగ్ సర్దార్ సర్టిఫికెట్ ఉండాలి. గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ లేదా మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష పాసై మూడేళ్ల మైనింగ్ ఇంజినీరింగ్ డిప్లొమా ఉండాలి. ఓవర్‌మ్యాన్స్ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ, గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
2. ఎలక్ట్రీషియన్ (నాన్-ఎక్స్‌కవేషన్/టెక్నీషియన్) పోస్టుకు మెట్రిక్యులేషన్/ తత్సమాన పరీక్ష పాసై, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి. అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ పూర్తవ్వాలి. నిబంధనల ప్రకారం.. ఎల్‌టీ పర్మిట్ లేదా 440-550 ఓల్ట్స్ మైనింగ్ పార్ట్స్ పర్మిట్, కేబుల్ జాయినింగ్‌లో హెచ్‌టీ పర్మిట్ ఉండాలి.
3. డిప్యూటీ సర్వేయర్ పోస్టుకు మెట్రిక్యులేషన్/ తత్సమాన పరీక్ష పాసవ్వాలి. మైన్స్ సర్వే సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి.
4. అసిస్టెంట్ ఫోర్‌మేన్ (ఎలక్ట్రికల్) పోస్టుకు మెట్రిక్యులేషన్/ తత్సమాన పరీక్ష పాసవ్వాలి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా ఉండాలి.

అభ్యర్థుల వయసు 19.04.2023 నాటికి 18 సంవత్సరాలు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గరిష్ఠ వయసు 35 సంవత్సరాలు. ఓబీసీ (నాన్‌క్రీమీలేయర్) అభ్యర్థులకు 33 సంవత్సరాలు. కోల్ ఇండియా లిమిటెడ్.. దాని అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు గరిష్ఠ వయసు లేదు.

దరఖాస్తు ఫీజు రూ.200 ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, కోల్ ఇండియా లిమిటెడ్, దాని అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్నవారు ఫీజు చెల్లించనవసరం లేదు.

ప్రతి పోస్టుకూ వేర్వేరుగా సీబీటీ

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను రాంచీ, జెంషెడ్‌పూర్, ధన్‌బాద్, హజారీబాగ్‌లోని ఏదో ఒక పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తారు. ఈ పరీక్షను ఎప్పుడు జరిపేదీ సీసీఎల్ వెబ్‌సైట్‌లో తెలియజేస్తారు. దరఖాస్తులో తెలిపిన విద్యార్హతల ఆధారంగా అభ్యర్థులను సీబీటీకి ఎంపిక చేస్తారు. దీంట్లో కనీసార్హత మార్కులు సాధించినవారిని డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు.

ప్రతి పోస్టుకూ వేర్వేరుగా సీబీటీని నిర్వహిస్తారు. ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ 2 మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ లేదు. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసార్హత మార్కులు 30. ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థుల 36 మార్కులు సాధించాలి. పరీక్ష ఫలితాలను సీసీఎల్ వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 19.04.2023
రాత పరీక్ష: 05.05.2023
ఫలితాల ప్రకటన: 29.05.2023
వెబ్‌సైట్: www.centralcoalfields.in/

బీఈడీతో పాటు మరో కోర్సు చేయొచ్చా?

గ్రాడ్యుయేషన్ తర్వాత బీఈడీ, మాస్టర్స్ ఒకే సంవత్సరంలో చదవాలనుకుంటున్నా. ఇలా చేస్తే ఏమైనా సమస్య వస్తుందా? యూజీసీ ఈ అవకాశం కల్పిస్తోందని విన్నాను. వాస్తవమేనా?

- ఎ.మహేష్

■ యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ఒకే సమయంలో రెండు డిగ్రీలు/ పీజీలు ఒకటి రెగ్యులర్‌గా, మరొకటి రెగ్యులర్/ఆన్‌లైన్/ డిస్టెన్స్/ ఓపెన్ పద్ధతిలో చదివే అవకాశం ఉంది. డిగ్రీ/పీజీతోపాటు డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సులు చేసే వెసులుబాటు గతంలో కూడా ఉంది. కానీ బీఈడీ లాంటి ప్రొఫెషనల్ కోర్సు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ అనే రెగ్యులేటరీ సంస్థ (ఎన్‌సీటీఈ) నియంత్రణలో ఉంది. ఇప్పటివరకైతే ఎన్‌సీటీఈ వారు బీఈడీతో పాటు మరో కోర్సు చేసే